క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వెంకటయ్య (ఫైల్)

దామెర : చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జినుక వెంకటయ్య (55) వ్యవసాయ, కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా జూన్ 19 ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో మద్యం అనుకొని గడ్డిమందు తాగాడు. అనంతరం తన చిన్న కుమారునికి ఫోన్‌చేసి విషయం తెలిపాడు. సంఘటనా స్థలానికి బంధువులు చేరుకొని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. వెంకటయ్య కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..


ఆత్మహత్య చేసుకున్న రంజిత్

ఎల్కతుర్తి : మద్యానికి బానిసైన కుమారుడిని తల్లి మందలించగా మనస్థాపానికి లోనైన కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాలప్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తంగళ్ల పల్లి రంజిత్ కుమార్(30) కొంత కాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఎందుకు తాగి గొడవ పడుతున్నావు, తాగుడు మానేయమని తన తల్లి మందలించింది. మనస్థాపం చెందిన రంజిత్‌కుమార్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ మార్చురీకి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ వద్ద సోమవారం పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ నుంచి కమలాపూర్‌కు గ్రానైట్ తరలించే లారీ ఖాళీగా వస్తోంది. ఉప్పల్‌లోని భీంపల్లి, కన్నూరు క్రాస్ వద్దకు చేరుకోగానే జమ్మికుంట నుంచి కమలాపూర్ వస్తున్న కారును డ్రైవర్ అతివేగంగా నడుపుతూ వచ్చి మెయిన్ రోడ్డుపై వస్తున్న లారీని గమనించకుండా క్రాస్ చేశాడు. సడెన్‌గా కారు రావడంతో లారీ డ్రైవర్ కారును తప్పించబోయాడు. ఈ క్రమంలో లారీ కారు వెనుకభాగానికి తగిలినప్పటికీ కారు డ్రైవర్ కారును ఆపకుండా వెళ్లిపోయాడు. లారీ మాత్రం డివైడర్ ఎక్కి మరో వైపున ఉన్న రోడ్డు దాటింది. లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని తప్పించడంతో పక్కనే ఉన్న డ్రెయినేజీలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. కాగా ఆ సమయంలో కారులో ఆరుగురు ప్రయాణిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పరామర్శ..

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజుగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కుమారస్వామి, నాయకులు సమ్మయ్య, సునీల్, రాజశేఖర్, పరమేశ్, శ్రీను, భాస్కర్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన అల్లం వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఆకుతోట సమ్మిరెడ్డి, యువజన నాయకుడు పొరండ్ల చరణ్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 3వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నాయకులు రమేశ్, శ్రీనివాస్, లింగయ్య, కుమార్, సదయ్య, రవి, ప్రశాంత్, రాజు ఉన్నారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

ఎల్కతుర్తి : దళిత వర్గానికి చెందిన అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ధర్మసమాజ్ పార్టీ మండల కన్వీనర్ బొంకూరి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. అనేక చోట్ల ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో ఉన్నత స్థాయి అధికారులు వేదింపులు, వివక్షతను చూపించి మనోవేధనకు కారకులవుతున్నారని తెలిపారు. అశ్వరావుపేట ఎస్సై ఆత్మహత్యకు కారకులైన వ్యక్తులపై (ఉద్యోగస్తులను) ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ఎస్సై శ్రీనివాస్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఆ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు నిర్మించాలి

ఐనవోలు : కొండపర్తి గ్రామానికి రోడ్డు నిర్మించాలని అదే గ్రామానికి చెందిన న్యాయవిద్యను అభ్యసిస్తున్న బర్ల శ్రవణ్ కోరారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ ఈఈ, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌కు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే అభివృద్ధి

- ఎమ్మెల్యేలు రేవూరి, గండ్ర
- మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం
- పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ


ఆత్మకూరు : మాజీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి


శాయంపేట : మాజీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ఆత్మకూరు : ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అంకిత భావంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాజీ ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీపీ సుమలత, మాజీ జెడ్పీటీసీ రాధిక, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు వరుణ్‌గాంధీ, రమరాజు, భాగ్య, ఇందిర, కో ఆప్షన్ సభ్యుడు అంకూస్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మండలంలో చేసిన సేవలను కొనియాడారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రజాప్రతినిధులు ఏ స్థాయిలో ఉన్నా తల్లిదండ్రులను మరువొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, హౌజింగ్ ఏఈ లత, పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ జయ్‌పాల్‌రెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రాజు, మైనారిటీ మండల అధ్యక్షుడు ఖాజా, నాయకులు సాంబయ్య, అశోక్ పాల్గొన్నారు.

శక్తి ఉన్నంతవరకు ప్రజాసేవ చేయాలి

శాయంపేట : ప్రజాప్రతినిధులకు పదవీ విరమణ ఉన్నప్పటికీ నిత్యం ప్రజల్లో ఉంటూ శక్తి ఉన్నంతవరకు ప్రజలకు సేవలందించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. ప్రజాప్రతినిధులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఎంపీడీఓ ఫణిచంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పదవుల కోసం కాకుండా సేవ చేసేందుకు ముందుకు వస్తే ప్రజలే పట్టం కడుతారని అన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు నిధులు రాకపోవడంతో ఆ పదవులు అలంకారప్రాయంగా మారాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలో బిల్లు ప్రవేశపెట్టినా ఎన్డీఏ ప్రభుత్వం అడ్డుకుంటుందని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 7లక్షల కోట్లు ఖర్చు అయినా సంక్షేమ పథకాలు అందజేసేందుకు వెనుకడుగు వేయడం లేదని, రూ.31 వేల కోట్లతో రైతు రుణమాఫీ ప్రకటించినట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులకు బిల్లులు రావాల్సిన ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. హైబత్‌పల్లి మాజీ సర్పంచ్ స్మశానవాటిక కట్టినప్పటికీ బిల్లు రాకపోవడంతో ఆత్మహత్య చేసుకోగా అదే స్మశానవాటికలో ఆయన శవాన్ని కాల్చినట్లు ప్రజాప్రతినిధులు గుర్తు చేశారు. అనంతరం మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లకు పూలమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. పీఆర్ డీఈ లింగారెడ్డి, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు


వేలేరు : రక్తదానం చేస్తున్న యువకులు

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రుద్ర రామేశ్వరాలయంలో కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రఘునాయకుల ప్రమోద్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

ఐనవోలు : స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. కడియం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ధర్మసాగర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శివాజీ విగ్రహం వద్ద నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మహా అన్నదానం చేపట్టారు. మాజీ ప్రజాప్రతినిధులు శరత్, రమేశ్, నర్సింహారెడ్డి, నాగరాజు, వెంకట్‌రెడ్డి, విప్లవ్‌కుమార్ రెడ్డి, రాజు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరంపై దాడులు



పరకాల : నిరుపయోగంగా ఉన్న ఓ డైరీ ఫామ్‌లో ఏర్పాటు చేసిన నాటుసారా స్థావరంపై పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నాటు సారా తయారీ కోసం ఐదు డ్రమ్ములలో నిల్వచేసిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ దారుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు పి.సత్తయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలసర్ప అశ్లేషబలి పూజ

ధర్మసాగర్ : మండలంలోని నవనాగ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన ఆలయంలో సోమవారం గ్రహ దోషాలకు, సర్ప దోషాలకు ప్రత్యేక పరిహారంగా ఆశ్లేషబలి కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ పవన్ శర్మ మాట్లాడుతూ.. గ్రహ దోషాలకు, వంశపార్యపరంగా ఏర్పడు సర్ప దోషాలకు పరిహారంగా ప్రతినెల అశ్లేషబలి ,ప్రతి అమావాస్యకు చండి హోమంతో పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

శాయంపేట : వన మహోత్సవంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మొక్కలు నాటారు.

గండ్రకు వినతుల వెల్లువ

భూ సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని మండల కేంద్రానికి చెందిన కుసుమ అరుణ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కాళ్లపై పడి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి పేస్కేల్ అమలు చేయాలని ఏపీఓ కీర్తి అనిత ఉపాధి సిబ్బందితో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు వెలిశాయని, చర్యలు తీసుకోవాలని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి సాంబయ్య వినతిపత్రం అందించారు.

నిరుపేదల గుండె చప్పుడు వైఎస్సార్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


శాయంపేట : వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు


ఎల్కతుర్తి : ముల్కనూరులో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ధర్మసాగర్‌లో..


ఆత్మకూరు : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

శాయంపేట : నిరుపేదల గుండె చప్పుడు దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించగా ఆయన పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహా నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు చేసిన సేవలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్ రవి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, నాయకులు రవి, రమేశ్, కృష్ణమూర్తి, రవీందర్, కట్టయ్య, రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. రైతులకు రుణమాఫీ, 108, 104, ఆరోగ్య శ్రీ పథకాలకు శ్రీకారం చుట్టి నిరుపేదలకు ఉచిత వైద్యం అందించిన గొప్ప ప్రజా నాయకుడు అని కొనియాడారు. అంతే కాకుండా జలయజ్ఞం పేరుతో ఎత్తిపోతల పథకం ద్వారా కరువు ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలకు సాగు నీరందించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు అశోక్‌రెడ్డి, సంతాజీ, రాజేశ్వర్‌రావు, మహేందర్, శ్రీకాంత్, అనిల్ కుమార్, వెంకటేశ్, సూరయ్య, పున్నం, సురేందర్, నవీన్, సుమన్, బాబురావు, రవీందర్, ఎర్రా, స్వరూప, కొమురయ్య, రమేశ్, ప్రభాకర్, పూర్ణచందర్, కుమారస్వామి, కళావతి, స్వర్ణలత, మంజుల, శారద సత్తెమ్మ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : దివంతగ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సోమవారం మండల కేంద్రంలో జరిగింది. ప్రముఖులు ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మార్క సుమలత, మాజీ జెడ్పీటీసీ రాధిక, సొసైటీ చైర్మన్ రవీందర్ గౌడ్, డైరెక్టర్ జయ్‌పాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, వాసు, రవి. సాంబయ్య పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టీకుమట్ల విష్ణు కోరారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా మండలంలోని ధర్మపురం గ్రామంలో సోమవారం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు రావయ్య, రాజు, అనిల్, శ్రీను, దయాకర్, దివాకర్, జహంగీర్ పాషా, సదానందం, వెంకటస్వామి, సమ్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

- గుణాత్మక విద్య జిల్లా సమన్వయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కమలాపూర్ : విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని గుణాత్మక విద్య జిల్లా సమన్వయ అధికారి ఎ. శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని గూడూరు, కమలాపూర్ (టాకీస్ ఏరియా), శనిగరం గ్రామాల్లోని ఎంపీపీఎస్ పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. గుణాత్మక విద్య కొనసాగింపుగా బుక్స్, నోట్ బుక్స్, టీచర్స్ హ్యాండ్ బుక్స్ ద్వారా తరగతులు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వన మహోత్సవంలో భాగంగా శనిగరంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పదోతరగతి విద్యార్థులతో పరస్పర చర్చ కొనసాగించి భాషా సమస్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం కమలాపూర్‌లోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి పదోతరగతి విద్యార్థులతో చర్చా పద్ధతి ద్వారా వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, సీఆర్పీలు శ్రీనివాస్, కరుణ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి


దామెర : అవగాహన కల్పిస్తున్న సఖి వన్ స్టాప్ సిబ్బంది

దామెర : సఖి వన్ స్టాప్ సేవలను బాధిత మహిళలు వినియోగించుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మహిళలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ హక్కులు, చట్టాలపై కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాల ద్వారా మహిళలు చైతన్యవంతులు కావాలని సూచించారు. అనంతరం కేస్ వర్కర్ వినీల మాట్లాడుతూ .. సంస్థ ద్వారా బాధిత మహిళలకు కౌన్సెలింగ్, న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి వంటి సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు 0870-2452112 నంబర్‌కు లేదా 181 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ కల్యాణి, జెండర్ స్పెషలిస్టు స్వర్ణలత, మానస, సూపరిండెంట్ అశోక్ బాబు, పిట్టల శ్రీకాంత్, లీల, అంగన్‌వాడీ సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించాలి

- మండల ప్రత్యేక అధికారి మాధవీలత


ఉద్యోగులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి మాధవీలత

దామెర : ప్రతీ ఉద్యోగి తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని మండల ప్రత్యేక అధికారి మాధవీలత అన్నారు. ఇటీవల పాలకమండలి గడువు ముగిసిన సందర్భంగా మాధవీలను మండల ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. కాగా సోమవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాధవీలత మాట్లాడుతూ.. ప్రతీ ఉద్యోగి సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, ఏపీఓ శారద, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రైతుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూరు : అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల కమిటీ కిసాన్ మోర్చా నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. రైతులకు ప్రధానమంత్రి పంట భీమా యోజనను అమలు చేయాలని, రైతు భరోసా అందించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా ప్రతినిధి గంకిడి బుచ్చిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బలవంతుల రాజు, మాజీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధానకార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, మండల కార్యదర్శి బయ్య పైడి, పాయిరాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రషర్‌తో నష్టపోతున్నాం

తమ వ్యవసాయ భూములకు సమీపంలో ఉన్న సాయిరాం స్టోన్‌క్రషర్ ద్వారా నష్టం జరుగుతోందని రైతులు యాట భాస్కర్, వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కొత్తగట్టు శివారులో ఉన్న తమ భూముల్లో సాగు చేస్తున్న పంటలు దుమ్ము ధూళితో నిండిపోతున్నాయన్నారు. పంట నష్టం జరుగుతుందని, బ్లాస్టింగ్ చేయడం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు

వారసత్వ సంపదపై అవగాహన అవసరం


ఉపాధ్యాయుడు రాచర్ల గణపతి ఆధ్వర్యంలో పురాతన నాణేలను ప్రదర్శిస్తున్న వైకుంఠాచారి

దామెర : వారసత్వ సంపదపై భావితరాలకు అవగాహన కల్పించాలని న్యూమస్ మాటిస్ట్ (నాణేల సేకర్త) వైకుంఠాచారి అన్నారు. ద్రవ్యం బ్యాంకింగ్, ద్రవ్య వ్యవస్థరుణం అనే అంశాలపై మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు రాచర్ల గణపతి ఆధ్వర్యంలో పురాతన నాణేలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైకుంఠాచారి మాట్లాడుతూ.. నాటి మహాజనపదాల కాలం నుంచి నేటి వరకు ద్రవ్యాన్ని నాటి రాజులు, నేటి ప్రభుత్వాలు ఏయే రూపాలలో వాటిని ప్రచురించారు అనే అంశాలను వివరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. సత్యనారాయణ మాట్లాడుతూ.. రాగి వైకుంఠాచారి వారసత్వంగా తన తండ్రి అభిరుచిని కొనసాగిస్తూ నాణేలు సేకరించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు డాక్టర్ రాచర్ల గణపతి మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యసన ఆసక్తిని పెంపొందించడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదపడుతాయని అన్నారు. ఉపాధ్యాయులు డాక్టర్ రాచర్ల గణపతి, రవీందర్ రెడ్డి, అనిత, విజయప్రభ, వసుంధర, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సురేందర్, పాల్గొన్నారు.

చెరువు కాదు.. ప్రభుత్వ పాఠశాలే


వరదలో నుంచి పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలోకి ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వరదనీరు ప్రవహించింది. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొండపర్తి నుంచి వనమాల కనపర్తి గ్రామానికి ఇటీవల బీటీ రోడ్డు పనులు పూర్తికాగా.. బీరన్న గుడి వద్ద జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రెయినేజీ కాల్వ కుంగింది. దీంతో వరదనీరు పక్కనేఉన్న ప్రభుత్వ పాఠశాలలోనికి ప్రవహించింది. దీంతో విద్యార్థులు వరదనీటిలో వడుస్తూ పాఠశాలకు చేరకున్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి డ్రెయినేజీని త్వరగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పాఠశాల ఆవరణలో వరదనీరు నిలవడంతో దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు.

మొరం తవ్వకాలపై అధికారుల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..



శాయంపేట : మండలంలోని మైలారం గుట్టలను మైనింగ్, రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించి విచారణ చేపట్టారు. ఈనెల 3న 'మైలారం గుట్టల్లో మొరం దొంగలు' అనే కథనం సాక్షిలో ప్రచురితం కాగా మైనింగ్ ఆర్ఐ చంద్రకళ, సర్వేయర్ పూర్ణ, శాయంపేట ఎమ్మార్వై శరత్‌కుమార్, ఏఆర్ఐ హుస్సెన్, సర్వేయర్ స్టాలిన్ విచారణ చేపట్టారు. మొరం తవ్వకాలను గుర్తించి తవ్విన ప్రాంతాన్ని కొలతలు తీశారు. సుమారు 1500 క్యూబిక్ మీటర్ల మొరం తవ్వకాలు జరిపినట్లు అధికారులు గుర్తించారు. మొరం తవ్వకాలు జరిపిన వారికి జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేస్తామని అధికారులు తెలిపారు.